RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 265 | సెప్టెంబర్ 21, 2025 | వెల : రూ.3-00



రోడ్ల మరమ్మత్తులు సత్వరమే పూర్తి చేయాలి

2లో..

# పోరు గట్టిగ లేదు..!

- ఎండోమెంటు ప్లీడర్ల పనితీరుపై మంత్రి సురేఖ తీవ్ర అసంతృప్తి
- దేవుడి భూములపై లీగల్ ఫైట్ సరిగా చేయండి
- ప్రతి ఆరు నెలలకొక సారి సమావేశం పెట్టి స్టేటస్ చెప్పాలని ఆదేశం
- ఎండోమెంటు భూములు కబ్జా చేస్తే పీడీ యాక్టు: మంత్రి కొండా సురేఖ



**వేద న్యూస్, హైదరాబాద్ :**

దేవుడి భూములపై లీగల్ ఫైట్ గట్టిగా చేయాలని, అసలు న్యాయ పోరాటం సరైన రీతిలో ఎందుకు జరగడం లేదని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అడిగారు. ఎండోమెంటు ప్లీడర్ల పనితీరుపై మంత్రి సురేఖ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.శనివారం రాష్ట్ర సచివాలయంలోని దేవాదాయ శాఖ మంత్రి పేషీలో ఎండోమెంటు గవర్నమెంటు ప్లీడర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి సురేఖ మాట్లాడుతూ ఎండోమెంటు కేసుల విషయంలో న్యాయవాదులతో ప్రతి ఆరు నెలలకొక సారి సమావేశం పెట్టి స్టేటస్ చెప్పాలని ఎండోమెంటు శాఖ అధికారులను ఆదేశించారు. దేవుడి భూములు కబ్జా చేస్తే పీడీ యాక్టు పెట్టాల్సిన అవసరం ఉందని మంత్రి నొక్కి చెప్పారు. ఎండోమెంటు భూముల అన్యాక్రాంతానికి సంబంధించి కేసుల పురోగతిని మంత్రి సమీక్షించారు.

**- నా ముందు కాదు..కోర్టులో వాదించాలి**

దేవుడి భూములు కాపాడటంలో ఎందుకు జాప్యం జరుగుతుందని నిలదీశారు. తన ముందు వాదించినట్టు ఇక్కడ కోర్టులో వాదించలేకపోతున్నారని మంత్రి అడిగారు. ఈ సమావేశంలో ఎండోమెంటు ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, యాదగిరిగుట్ట ఈవో వెంకటరావు, కమిషనర్లు క్రిష్ణ ప్రసాద్, క్రిష్ణవేణి, ఎండోమెంటు శాఖ గవర్నమెంటు ప్లీడర్(జీపీ) బీఎం నాయక్, ఏజీపీ శైలజ,



విక్రమ్ తదితరులు పాల్గొన్నారు. దేవుడి భూములు కాపాడటంలో లీగల్ టీం పాత్ర చాలా కీలకమైందని మంత్రి సురేఖ పేర్కొ న్నారు. తాను దేవాదాయ శాఖ మంత్రి అయి రెండు సంవత్సరాలు అయిందని ఇప్పటికీ కేసులు ఏం గెలిచామో తెలియడం లేదని మంత్రి స్పష్టం చేశారు. అయితే, ఇప్పటివరకు ఎన్ని కేసులు గెలిచామో వివరించాలని చెప్పారు. అసలు కేసుల విషయంలో అప్డేట్

మిగతా 3వ పేజీలో..



## పూల వ్యర్థాలతో కంపోస్ట్ తయారీ

**- కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

వేద న్యూస్, వరంగల్:

పూల వ్యర్థాలతో కంపోస్ట్ తయారీ చేసేలా చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు.శనివారం హన్మకొండ పరిధి బాలసముద్రం లోని పెట్ పార్క్ తో పాటు మార్కెట్ ప్రాంతం లో కమిషనర్ క్షేత్ర స్థాయి లో సందర్శించి సమర్థవంతం చేపట్టుటకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కమర్షియల్ చెత్త సేకరణ వాహనాలకు టైం షెడ్యూల్ ను ఏర్పాటు చేసి సూచించిన సమయానికి వాహనాలు వచ్చి చెత్తను సేకరించే విధంగా స్ట్రీమ్ లైన్ చేయాలని వీధి వ్యాపారులు వ్యాపారాలు చేసుకొని వెళ్లి పోయే క్రమంలో పొగైన చెత్త వ్యర్థాలను అలాగే వదిలి వెళ్ళిపోకుండా గార్బేజ్ లో వేసే వెళ్ళే విధంగా చర్యలు చేపట్టాలని డ్రైన్ ల నుండి తొలగించిన వ్యర్థాలను 24 గం.లోగా తొలగించాలని, బతుకమ్మ పండుగ సందర్భంగా పెద్ద మొత్తంలో పూలను వినియోగిస్తారని మిగిలి పోయిన పూల వ్యర్థాలను సేకరించడం కోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి సేకరించి అట్టి ఉత్పత్తులతో కంపోస్టు ఎరువు తయారు చేసేలా చూడాలని అన్నారు. బాలసముద్రం మార్కెట్ లో ఉత్పతి అయ్యే కూరగాయల వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని మార్కెట్ పక్కన గల రోడ్డు సమస్య గురించి టౌన్ ప్లానింగ్ అధికారులు రిపోర్ట్ అందజేయాలని కమిషనర్ అన్నారు.ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, వెటర్నరీ వైద్యులు డా.గోపాల్ రావు, సానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు

**- మూడు రోజులుగా ప్రభుత్వానికి, దవాఖానల యాజమాన్యాలకు మధ్య వారధిగా రాజేందర్ రెడ్డి**

- నెట్ వర్క్ ఆసుపత్రుల సమ్మె విరమణ
- ఫలించిన ఎమ్మెల్యే నాయిని కృషి

**వేద న్యూస్, హనుమకొండ:**

గత మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన ఆరోగ్య శ్రీ సేవలు ఆదివారం నుంచి మళ్లీ ప్రారంభమయ్యాయి. ప్రైవేట్ నెట్‌వర్క్ హాస్పిటల్స్ యాజమాన్యాలు చేపట్టిన సమ్మెను విరమించడం ద్వారా, వేలాది మంది పేద రోగులకు మళ్లీ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ పరిణామానికి ప్రధాన కారకుడిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాత్ర కీలకంగా నిలిచింది.

**- ప్రజల తరఫున నాయకుడిగా కృషి**

ఆరోగ్య శ్రీ బకాయిలు, విధానాలపై ఏర్పడిన విభేదాలతో, ప్రైవేట్ నెట్‌వర్క్ హాస్పిటల్స్ ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయగా, ఆ కొరత తీవ్రంగా ప్రజలను వేధించింది. ఈ సమయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మూడు రోజులుగా నిరంతరం కృషి చేస్తూ, ప్రభుత్వానికి, హాస్పిటల్స్ యాజమాన్యానికి మధ్య వారధిగా వ్యవహరించారు.వారు ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాల రాష్ట్ర కమిటీ సభ్యులతో ప్రత్యక్షంగా చర్చలు జరిపారు. వైద్యుల సమస్యలు, ఆసుపత్రుల ఆందోళనలు మనస్పూర్తిగా వినిపించారు., తెలంగాణ రాష్ట్ర



ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి తో, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ తో నేరుగా చర్చలు జరిపి, ఫోన్ ద్వారా అనేక సమన్వయాలు చేసి, సమస్యను పరిష్కరించే దిశగా ప్రభుత్వానికి స్పష్టతనిచ్చారు.

**- ఆరోగ్య శ్రీ సేవలు తిరిగి ప్రారంభం**

ఈ చర్చల అనంతరం, నెట్ వర్క్ హాస్పిటల్స్ సమ్మె విరమించేందుకు సిద్ధమయ్యాయి. నేటి నుంచి అన్ని ఆరోగ్య శ్రీ గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో మళ్లీ ఆరోగ్య శ్రీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇది రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించిందని విశ్లేషకులు పేర్కొం టున్నారు.



ఆడబిడ్డల ఆత్మగౌరవ అడ్డ..

## ఓరుగల్లు గడ్డ

- నేటి నుంచి బతుకమ్మ సంబురాలు
- ఆరంభ వేడుకల్లో పాల్గొననున్న మంత్రులు జూపల్లి, కొండా సురేఖ, సీతక్క

**వేద న్యూస్, హైదరాబాద్ :**

ఆడబిడ్డల ఆత్మగౌరవ అడ్డ..ఓరుగల్లు గడ్డ మీద నేటి(ఆదివారం) నుంచి బతుకమ్మ సంబురాలు షురూ కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలు వరంగల్ పట్టణంలోని వెయ్యి స్తంభాల గుడిలో ప్రారంభం అవనున్నాయి. అయితే, ఆరంభ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, ధనసరి అనసూయ సీతక్క పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసి... రాష్ట్ర మహిళలకు చిన్న బతుకమ్మ వేడుకల శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఈ ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. సకల జనులు, సబ్బండ వర్ణాలు కలిసి ఐక్యత స్ఫూర్తిని చాటేలా రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు రూపొందించదన్నారు. చారిత్రక ప్రదేశాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రాంతాల్లో తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నహాలు చేసిందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఇదే విషయమై ఇప్పటికే జిల్లా కలెక్టర్ తో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి, అన్ని ఏర్పాటు చేసినట్టు వివరించారు. ప్రకృతితో మమేకమైన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యాన్ని బతుకమ్మ పండుగ విశ్వవ్యాప్తంగా చాటుతుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.




కోర్టులకు అవసరమైన మౌలిక

## సదుపాయాలను కల్పిస్తాం

**వేద న్యూస్ డెస్క్:**

రాష్ట్రంలో న్యాయ వ్యవస్థకు సంబంధించి మౌలిక సదుపాయాల కల్పన, న్యాయస్థానాల్లో సిబ్బంది నియామకం వంటి అంశాలపై తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్రంలో ముఖ్యంగా కొత్త జిల్లాల్లో కోర్టు భవనాలు, మౌలిక వసతులను



మిగతా 4వ పేజీలో..

# సుద్దాల ప్రవీణ్ ఆచార్యకి పురోహిత స్మార్త బిరుదు ప్రదానం

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**




వరంగల్ కు చెందిన ప్రముఖ వాస్తు జ్యోతిష్య పురోహితులు, బ్రహ్మశ్రీ సుద్దాల ప్రవీణ్ ఆచార్య విశిష్ట సేవలకు గాను "పురోహిత స్మార్త" అవార్డు లభించింది. విల్లుపురం (తమిళనాడు) కేంద్రంగా పనిచేస్తున్న ఇంటర్నేషనల్ హిందూ టెంపుల్స్ అండ్ స్పిరిట్యుయల్ ఆస్ట్రాలజర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వరంగల్లోని పుష్పరాజ్ కన్వెన్షన్ హాల్లో శనివారం '6వ ఇంటర్నేషనల్ స్పిరిట్యుయల్ ఆస్ట్రాలజికల్ కాన్ఫరెన్స్, ఐకానిక్ అవార్డ్స్ తెలంగాణ – 2025' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా, సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ జె. విశ్వనాథన్ చేతుల మీదుగా, పలువురు ప్రముఖ పండితుల సమక్షంలో సుద్దాల ప్రవీణ్ ఆచార్యని శాలువాతో సత్కరించి "పురోహిత స్మార్త" బిరుదును అందజేశారు.

# ఎల్బీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు




**వేద న్యూస్, వరంగల్:**

లాల్ బహదూర్ కళాశాల ఎన్సిసి ఆర్మీ పదవ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డిహెచ్ రావు తెలిపారు. తెలంగాణ సంస్కృతి,సాంప్రదాయాల్లో మన బతుకుకు బతుకమ్మకు, ప్రకృతికి ఎంతో అవినాభావ సంబంధం ఉన్న గొప్ప పండుగ ప్రపంచంలో ఎక్కడ లేదని అది తెలంగాణ ఆడపడుచులకు భగవంతుడిచ్చిన వరమని ఎన్నో సంస్కృతులలో బతుకమ్మ పండుగ గొప్పదని భాష,సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడే విధంగా ఎన్సిసి కాడేట్స్ అందరిని అబురపర్చారని ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాల ప్రాంగణంలో ఎన్సిసి క్యాడేట్స్ ఘనంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ ఎన్సిఓ దీపక్ మరియు దశరథం ఆర్మీ సిబ్బంది కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, డాక్టర్ కే రాజేందర్ రెడ్డి,వి మధుకర్ రావు,ఎస్వి రమణారెడ్డి సిహెచ్ రవీందర్, సుధాకర్, నగేష్, సతీష్, రాధిక,మమత, రజిని ఎన్సిసి క్యాడేట్స్ పాల్గొన్నారు.

# రైతులకు సరిపడ యూరియా అందించాలి




**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో పార్టీ మండల అధ్యక్షులు గంగుల మనోహర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు మాట్లాడుతూ టేకుమట్ల మండల కేంద్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులే రోడ్డెక్కి తమ ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలపై, అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలంటు అన్నారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నిన్న ధర్నా చేయడం, ఎమ్మెల్యే ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటానని బహిరంగంగా చెబుతూనే తన అనుచరులతో అక్రమ రవాణాను కొనసాగిస్తున్నాడంటూ కాంగ్రెస్ నాయకులే చెబుతున్నారంటే, అక్రమ ఇసుక రవాణా ఎంత జోరుగా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు అన్నారు.అయితే అక్రమ ఇసుక రవాణాను అరికట్టవలసిన అధికారులుచోద్యంచూస్తున్నారు .అధికారులు ఎమ్మెల్యేకు కొమ్ముకోస్తున్నారంటూ విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్ నాయకులే రోడ్డెక్కారంటే అవినీతి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు .ఇకనైనా నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే అవినీతి అక్రమాలను అర్థం చేసుకోవాలని, నిన్న టేకుమట్ల మండలంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటు అంటూ వారికి బేశరత్తుగా క్షమాపణ చెప్పాలనీ వారు డిమాండ్ చేశారు. రైతులకు సరిపడా యూరియా అందివ్వలేని ఎమ్మెల్యే ఇదే అదనుగా అక్రమంగా ఇసుక తరలిస్తూ పైసలు దండుకుంటున్నాడు అన్నారు .దీన్ని నిశితంగా పరిశీలిస్తున్న నియోజకవర్గ ప్రజలు రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఊర్లల్లో తిరిగితే పరిస్థితి లేదు అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వంగల నారాయణరెడ్డి, రామ్ శెట్టి లక్ష్మారెడ్డి, మేకల శ్రీనివాస్, మారపెల్లి నందం, మారపెల్లి మోహన్,అరికెళ్ల ప్రసాద్ ,దైనంపల్లి సుమన్ , కుసుమ శరత్, మేకల వెంకటేశ్వర్లు, వల్పదాసు చంద్రమౌళి,గడిపే విజయ్, కరుణ్ బాబు, సొల్ల కిష్టయ్య, నర్ర రాజు, రంగు మహేందర్, కృష్ణారెడ్డి, కొమ్మల శివ, అజయ్ కుమార్, కుతాటి రమేష్, వినయ్,సోషల్ మీడియా మండల కన్వీనర్ దాసి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అరవింద పబ్లిక్ స్కూల్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**వేద న్యూస్, ఖిలావరంగల్ :**



నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలోని అరవింద పబ్లిక్ స్కూల్ లో ప్రిన్సిపాల్ పంచకం రమాదేవి ఆధ్వర్యంలో శనివారం ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య ముఖ్యఅతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నర్సయ్య మాట్లాడుతూ ప్రపంచంలోనే మరెక్కడా లేని విధంగా ప్రకృతిలో దొరికే పువ్వులను పూజించే పండుగ తెలంగాణలో మాత్రమే జరుపుకుంటామని అన్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగ. ప్రకృతిలో దొరికే తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఇంటిల్లిపాది సంబరంగా జరుపుకునే ప్రకృతి పండుగ. ఇది ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి మొదలు తొమ్మిది రోజుల పాటు ముస్తాబయ్యే బతుకమ్మ సాక్షాత్తు అమ్మవారి స్వరూపమేనని భావిస్తారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి అందులో గౌరీదేవిని అలంకరించి పాటలు పాడుతూ నృత్యం చేస్తూ తొమ్మిదో రోజున బతుకమ్మలను చెరువులలో నిమజ్జనం చేస్తారు. ఈ పండుగ ముఖ్య ఉద్దేశం పార్వతి దేవిని ఆశీర్వాదం కోరడం ప్రకృతికి కృతజ్ఞతలు తెలియజేయడమని తెలిపారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో బతుకమ్మలను పేర్చుకొని వచ్చి ఒకచోట పెట్టి వాటి చుట్టూ చప్పట్లు కోలలతో పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ బతుకమ్మ వేడుకలను అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీలు కె అశ్విని, ఎ నర్మద, కె దివ్యశ్రీ, ఎ సుష్మిత, ఎం రమ్య, పి స్రవంతి, అఫ్రీన్, జి బాలప్రభ, కె గౌతమి, జి లీనాశ్రీ, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల మరమ్మత్తులు సత్వరమే పూర్తి చేయాలి

**వేద న్యూస్,ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు సత్వరమే చేపట్టాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ రాజన్న సిరిసిల్ల జిల్లా యంత్రాంగాన్ని కోరారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి ఇల్లంతకుంట మండలంలోని నరేడిపల్లి, తాళ్లపల్లి,ముస్కానిపేట,సిరికొండ గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వెంటనే రోడ్ల మరమ్మతు పనులు చేపట్టాలని ఎమ్మెల్యే కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. సత్వరమే మరమ్మత్తు పనులు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆయా రోడ్ల మరమ్మత్తు పనులకు సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సిరికొండ గ్రామంలో అసైన్డ్ భూములను 45 మంది ఎస్సీలకు నివేశన స్థలాలుగా కేటాయిస్తే వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పగా, అందుకు కలెక్టర్ అంగీకరించారు. ఈ పర్యటనలో ఇల్లంతకుంట మండల తహసీల్దార్ ఫారుఖ్, ఎంపీడీవో శశికళ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, అంతగిరి టెంపుల్ చైర్మన్.కోలాపురి అంతగిరి.మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు.రజనీకాంత్, వీరేశం, పార్టీ నాయకులు,పసుల వెంకటి, ఐరెడ్డి. మహేందర్. వెంకటరెడ్డి, తీగలపుష్పలత, మామిడి రాజు, నేరెళ్ల విజయగౌడ్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిలకి సైకిల్ల పంపిణీ

**వేద న్యూస్,బోయినిపల్లి:**




రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలలో సి ఎస్ అర్ నిధులతో మోడీ, గిఫ్ట్ కానుకగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, జన్మదినం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా 20,000 సైకిళ్లు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో భాగంగా శనివారం బోయినిపల్లి మండలం కేంద్రంలోని బోయినిపల్లి, స్థంబంపల్లి, కొదురుపాక, మల్లాపూర్, విలాసాగర్, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థిని,విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా 97 సైకిల్ లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ బోయినిపల్లి మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే పిల్లలు పేద కుటుంబం నుండి వచ్చిన వాళ్లే ఉంటారనే విషయం తెలిసిందే. తమ ఇంటి నుండి స్కూల్ కి వెళ్లడానికి తగిన రవాణా సౌకర్యాల్లేక, ఆటోలు, బస్సులలో, వెళ్లే స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా టెన్త్ క్లాస్ విద్యార్థులకి స్కూల్ వేళలు ముగిసిన తరువాత స్పెషల్ క్లాస్ లకు హాజరు కావాల్సి ఉంటుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ శ్రవణ్ కుమార్, అలాగే ఆయా పాఠశాల ల ఉపాధ్యాయని , పాధ్యాయులు తల్లిదండ్రులు,జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, భూగోని అశోక్ గౌడ్, జువ్వెత్తుల శ్రీనివాస్ రెడ్డి , మెరుపుల గంగాధర్, బోగోజి గంగాధర్ చారి , కొండమ్ శ్రీనివాస్ రెడ్డి ,హరీష్ ,సారంపల్లి రాజు , మారం ఉపేందర్, పసికంటి వెంకటేశం ,కల్యాణం అనిల్, ఇల్లందుల పరిషయ్య ,రాజు, ఐలయ్య, రమేష్ ,ప్రభు, విజయేందర్ రెడ్డి ,సాయి, భాస్కర్,రమేశ్, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సమీక్ష సమావేశం

**వేద న్యూస్, కమలాపూర్ :**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ హరికిషన్ పాల్గొని మాట్లాడారు. సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కమలాపూర్ మండలంలోని అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లను త్వరిత గతిన పూర్తిచేయాలని, ఇంటి నిర్మాణాన్ని బేస్మెంట్ లెవెల్ పూర్తి చేసిన తర్వాత ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన యాప్ లో అప్ లోడ్ చేయాలని ఆ తర్వాత లక్ష రూపాయలు లబ్ధిదారుల ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని ఇదేవిధంగా నిర్మాణ దశలను బట్టి ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం నిర్మించుకుంటూ వాటి ఫోటోలను యాప్ లో అప్ లోడ్ చేసి ఆ తర్వాత బిల్లును పొందాలని తెలిపారు. ప్రభుత్వం ప్రతి సోమవారం ఇంటి నిర్మాణానికి సంబంధించిన ఫోటోలను అప్ లోడ్ చేసిన లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేస్తుందని అన్నారు. కమలాపూర్, గూడూరు, మర్రిపల్లిగూడెంలలో నిర్మించి ఉన్న డబుల్ బెడ్ రూమ్ లను స్థలములేని నిరుపేదలకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం కేటాయించుతుందని స్పష్టం చేశారు.

ఈ సమావేశానికి హాజరైన కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ రాణి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయడానికి అధికారులందరూ చురుకుగా పనిచేయాలని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కమలాపూర్ మండలాన్ని ముందు వరుసలో నిలపాలని అధికారులను ఆమె కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో గుండె బాబు, హౌసింగ్ డిఈ రవీందర్, హౌసింగ్ ఏఈ హరిహరన్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# పోరు గట్టిగ లేదు..!

కోసం అడిగితే డిపార్టుమెంటులో ఎవరు చెప్ప లేకపోవడం న్యాయ విభాగం అప్‌డేట్ చేయకపోవడం ఏంటని మంత్రి ప్రశ్నించారు. మన దేవుడి భూములు మనం దక్కించు కోవాలన్నారు. దూరదృష్టితో కేసులు పరిష్కరి ంచుకోవాలన్నారు. ఏ కేసుల మీద న్యాయ పోరాటం చేశారో... వాటిని పరిష్కరించడంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురయ్యాయో మంత్రి సురేఖ న్యాయ వాదులను అడిగారు. అయితే, మంత్రి ప్రశ్నకు సమాధానంగా 2002 నుంచి 2025 వరకు 1,500 కేసులు పెండింగులో ఉన్నాయని తెలిపారు. ఈ కాల వ్యవధిలో 543 కోర్టు కేసులను డిస్పోజ్ చేసినట్టు ప్రభుత్వ ప్లీడర్లు వివరించారు. కేసుల్లో పురోగతికి సంబంధించిన అంశాలు, జడ్జిమెంట్ కాపీ ఎండోమెంటు శాఖ సెక్రటరీకి అందజేయాలని సూచించారు. ఎండోమెంటు డిపార్టుమెంటుకు సంబంధించిన కేసుల్లో రీట్ పడిన దగ్గరి నుంచి కేసు పూర్తయ్యేవరకు ఎలా ముందుకు వెళుతున్నది వివరించాలని చెప్పారు.

**– నిర్లక్ష్యం వహించకూడదు**

ఎండోమెంటు కేసుల్లోని కంటెప్ట్ ఆఫ్ కోర్టు అంశాలు తీవ్రంగా ఇబ్బందులు ఏర్పడుతు న్నాయని అన్నారు. వీటి విషయంలో గౌరవ హైకోర్టులను పిలిచేదాకా ఎందుకు తీసుకెళ్ళాలని మంత్రి అడిగారు. ఈ విషయంలో న్యాయ విభాగ టీం, వారి కింద వ్యవస్థ సరైన టైంలో ఎండోమెంటు ఉన్నతాధికారులను అలర్ట్ చేస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. భూములకు సంబంధించిన అంశాలు, టెంపుల్ ఎంప్లాయీస్ సర్వీసు వ్యవహారాలు కూడా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అప్పుడే మన డిపార్టుమెంటుకు అనుకూలంగా వస్తాయని తెలిపారు. అయితే, వచ్చిన ఆర్డర్స్ ను అమలు పరిచేందుకు కూడా ఒక వ్యవస్థ ఉండాలని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ అను మతితో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని మంత్రికి చెప్పగా... అందుకు కావాల్సిన పనులు చేయాలన్నారు. సివిల్ సప్లయ్ డిపార్టమెంటులో ఉన్న మాదిరిగా ఉండాలన్నారు. కౌంటర్లు వేయ డంలో కూడా ఏమాత్రం నిర్లక్ష్యం వహించొద్ద న్నారు. కింది స్థాయి ఈవోలు కూడా అందుకు సహకరించాలన్నారు. ఎవరైనా సహకరించకపోతే ఎండోమెంటు సెక్రటరీ దృష్టికి తీసుకురా వాలన్నారు. దేవుడి భూముల జోలికిస్తే పీడీ యాక్టులు పెట్టేందుకు వెనకాడొద్దని అధికారులకు చెప్పారు. ఎండోమెంటు చట్టం మీద అధికారులకు ట్రైనింగు క్లాసులు నిర్వహించాలని మంత్రి చెప్పారు. జిల్లాకో లీగల్ ఆఫీసుర్ను నియ మించాలని అన్నారు. హైకోర్టుకు కూడా లైజన్ ఆఫీసర్ ను నియమించాలని..ఈవోల నుంచి ఒకరు ఉండాలని న్యాయ విభాగ టీం సూచిం చగా మంత్రి అనుమతించారు. వెంటనే అందుకు సంబంధించిన ప్రపోజల్ తనకి పంపించాలని పేర్కొన్నారు.

# ఘనంగా బతుకమ్మ వేడుకలు

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**




ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తీసుకొచ్చిన తీరొక్క రంగుల పూలతో విద్యార్థుల మహిళా ఉపాధ్యాయులందరూ కలిసి బతుకమ్మ తయారు చేసి ఒకచోట పేర్చి బతుకమ్మ ఆటలు ఆడారు. అనంతరం విద్యార్థులు బతుకమ్మలను నిమర్జనం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ విజయభాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే పండుగ బతుకమ్మ పండుగ అని అన్నారు. విద్యార్థులకు సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, కృష్ణంరాజు, రజిత, శరణ్య, ప్రవళిక, నవత, భూదమ్మ, రాజు, ఈశ్వర్, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రూసో కళాశాలలో బతుకమ్మ వేడుకలు



**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి, రూసో బీఎడ్, డీఎడ్, కాలేజీలో ముందస్తు బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మలను పేర్చి, ఆట పాటలతో ఆడి పాడి సందడి చేసి, అందరినీ అలరించాయ్.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ దేవేందర్, విద్యార్థులకు బతుకమ్మ పండుగ యొక్క విశిష్టతను వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మ రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్న విషయాన్ని గుర్తుచేశారు. విద్యార్థులు కూడా తమ మాటల్లో బతుకమ్మ గొప్పతనాన్ని వివరించి అందరినీ ఆకట్టుకున్నారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ పండుగలో ప్రతి రోజూ ప్రత్యేకమైన బతుకమ్మలు..ఎంగిలిపూల బతుకమ్మ, అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయ బతుకమ్మ, చివరగా సద్దుల బతుకమ్మ, ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని వివరించారు.ఈ వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకలను పాఠశాలలో నిర్వహించడం పట్ల అందరూ సంతోషం వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంపత్ ,అధ్యాపకులు రాజ్ కుమార్,సురేష్,మోహన్,బాలయ్య,మౌనిక ,సత్యం,ప్రసాద్,శ్రీనివాస్,లు తదితరులు పాలుగోన్నారు.

# టీడబ్ల్యూజేఎఫ్ పేరుతో తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**




తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) పేరుతో వరంగల్ జిల్లాలో కొందరు వ్యక్తులు తప్పుడు ప్రచారాలు చేయడాన్ని ఆ జిల్లా ఫెడరేషన్ అధ్యక్ష, కార్యద ర్శులు జక్కుల విజయకుమార్, బొట్ల స్వామిదాస్ తీవ్రంగా ఖండించారు. ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం సూచన మేరకు జిల్లా మూడో మహాసభలు 2025 జూలై 5 న జరిగాయని, అయితే కొందరు జర్నలిస్టు మిత్రులు మళ్ళీ యూనియన్ మహాసభలు జరుపుతున్నాం అంటూ అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. నెలరోజుల పాటు జిల్లావ్యాప్తంగా సభ్యత్వాల నమోదుకు సమయం ఇచ్చి జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులందరినీ కలుపుకొని వివిధ మీడియా ఛానళ్లు, పత్రికల జర్నలిస్టులతో సభ్యత్వాలు నమోదు చేయించి రాష్ట్ర కమిటీ సమక్షంలో పూర్వ కార్యదర్శి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులమైన తాము రాష్ట్ర, జాతీయ కౌన్సిల్ సభ్యుల పర్యవేక్షణలో మహాసభ,జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించి జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగిందని వివరించారు. జిల్లా అధ్యక్ష,కార్యదర్శులుగా తాము (జక్కుల విజయ్ కుమార్, బొట్ల స్వామిదాస్) ఎన్నికయ్యామని, పూర్తిస్థాయి కమిటీని ఎన్నికొని జర్నలిస్టుల సమస్యలపై రాష్ట్ర కమిటీ సూచనల మేరకు వ్యూహాత్మకంగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంలో గతంలో సంఘంలో ఉన్నటువంటి కొంతమంది సభ్యులు రాష్ట్ర కమిటీ సూచన మేరకు సభ్యత్వాలు నిర్వహించకుండా యూనియన్ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ రాజకీయ నాయ కులతో కుమ్మక్కై సభ్యత్వాలు చేయించకుండా జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోకుండా,మహాసభలు నిర్వహించ కుండా యూనియన్ కు వ్యతిరేకంగా ఉన్న నాయకులు గత వారం రోజులుగా మళ్ళీ వరంగల్ జిల్లా టీడబ్ల్యూజేఎఫ్ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ప్రకటనలు చేస్తూ స్థానికంగా ఉండే రాజకీయ నాయకులను, అధికారులను కలుస్తూ జర్నలిస్టులకు మభ్యపెట్టే మాటలు చెబుతూ వివిధ రూపాల్లో తప్పుడు ప్రచారం చేస్తూ, వరంగల్ ప్రాంతంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. కొందరు చేస్తున్న ఈ తప్పుడు ప్రచారాన్ని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ఒక ప్రకటన ద్వారా ఖండిస్తూ జూలై 5వ తేదీ 2025 న వరంగల్ జిల్లాలో పూర్తిస్థాయి కమిటీ ఎన్నిక జరిగినట్లు ప్రకటించారని, ఎవరైనా టీడబ్ల్యూజేఎఫ్ పేరు మీద మళ్ళీ మహాసభలు నిర్వహిస్తే చట్టరీత్య చర్యలు ఉంటాయని హెచ్చరించారని వారు తెలిపారు. జిల్లాలో కొంతమంది చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తాము కూడా ఖండిస్తున్నామని, జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, అధికా రులు తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తుల ప్రచారాలను నమ్మవద్దని అన్నారు. వరంగల్ జిల్లా కమిటీ పూర్తిస్థాయిలో జులై ఐదు నుంచి పనిచేస్తుందని, తప్పు డు ప్రచారం చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లు, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందని, ఈ సంఘం పేరును బద్నాం చేయదలిస్తే చట్ట రీత్యా చర్యలు ఉంటాయని అన్నారు. ఈ మీడియా సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ పాలడుగుల సురేందర్, ఉపాధ్యక్షుడు వెల్ది రాజేందర్, సంయుక్త కార్యదర్శులు, భావాండ్లపెల్లి కిరణ్ కుమార్, రాంపల్లి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పెండెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్లో బతుకమ్మ వేడుకలు

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని మోడల్ స్కూల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రఘునాథ్,మాట్లాడుతూ ప్రపంచంలోనే వివిధ రకాల పూలతో జరుపుకునే ఏకైక పూల పండుగ,మన తెలంగాణలోనే మహిళా ఆడపడుచులు ఇరుపుకుంటారు. మన రాష్ట్ర పండుగైన బతుకమ్మ వేడుకలలో భాగంగా తెలంగాణ యాసలో పాటలు పాడుతూ తల్లికూతుళ్ళ, అన్నాచెల్లెల్ల అనురాగాలు, ఉమ్మడి కుటుంబంలో కష్టసుఖాల గురించి మహిళలు తన పాటల ద్వారా వెల్లడి చేస్తారు. కుటుంబం అంతా ఆమె కల్ల ముందే బ్రతకడం ఆమె జీవితానికి ఒక వరం వంటిది అందుకే తన వాళ్ళందరికీ చల్లటి బతుకును ప్రసాదించుమని గౌరీ, దేవతని బతకమ్మగా పూజిస్తుంది. ప్రకృతి నుండి సేకరించిన పూలను మళ్లీ ప్రకృతికి సమర్పించుకోవడం. బతుకమ్మను నీటిలో విడిచిపెట్టడం అనేది ప్రపంచంలో ఎక్కడా లేని సంస్కృతి మనది అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అద్యాపక ఉపాధ్యాయులు శ్రీలత, రాజేశ్వరి, నాగలక్ష్మి, పద్మ, అనుశ్రీ, రాధిక, లావణ్య, రమ, లు పాల్గొన్నారు.

# చెరువు అక్రమాణపై తహసిల్దార్ కు ఫిర్యాదు



**వేద న్యూస్, గంగాధర :**

గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలోని ఊర చెరువులో మట్టి తవ్వి చెరువు నీటిని అక్రమంగా వాడుకుంటున్నాడు అని గ్రామంలోని మత్స్యకారులు శనివారం గంగాధర తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. వివరాల్లోకెళ్తే గర్శకుర్తి గ్రామానికి చెందిన బుద్ధి నాగయ్య అనే వ్యక్తి చెరువు శిఖం భూమిని ఆక్రమించి అక్రమంగా

చెరువులోని నీటిని ఎటువంటి అనుమతి లేకుండానే మోటార్ ద్వారా తను వాడుకుంటున్నట్లు తెలిపారు. దీనివల్ల గ్రామ ప్రజలకు కీలకమైన సాగు, తాగునీటి ఇబ్బందులకు గురి అయ్యే అవకాశం ఉందని అలాగే భూగర్భ జలాలు అడుగంటి భూగర్భ జల మట్టాలు కూడా గణనీయంగా పడి పోయే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని సుమారు 110 మత్స్యకార కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. గ్రామం లోని తాసిల్దార్ వెంటనే స్పందించి చెరువు పరిధిని సర్వే చేయించి శిఖం భూములను గుర్తించి, బఫర్ జోన్‌ను పరిరక్షించాలని కోరుతున్నారు. అలాగే, నీటి అక్రమ వినియోగాన్ని నిలిపివేసి, చెరువును అన్యాక్రమణ నుండి కాపాడాలనీ గ్రామంలోని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# గీత విద్యాలయంలో ముందస్తు బతుకమ్మ సంబరాలు

**వేద న్యూస్, చొప్పదండి :**



చొప్పదండిలోని గీతా విద్యాలయంలో శనివారం రోజు ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తీరోక పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో విద్యార్థినిలు పాఠశాలకు వచ్చి బతుకమ్మ ఆటలు ఆడుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డైరెక్టర్ లింగారావు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి అని దీనిని తప్పకుండా తెలంగాణలో పుట్టిన వారందరూ ఘనంగా జరుపుకోవాలని, పిల్లలకు అవగాహన కొరకు ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ గుర్రం ఆనంద రెడ్డి, ప్రిన్సిపాల్ కనకయ్య, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

